సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 21 । డిసెంబర్ । 2023



కూలీల వాహనం బోల్తా
అట్లూరు మండలం ఎస్.వెంకటాపురం సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారి పక్కన ఉన్న వంకలో వ్యవసాయ కూలీల వాహనం బోల్తా పడింది.
-8లో



హుండీ దొంగ అరెస్టు
లింగాల మండలం అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ దేవాలయంలో హుండీ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు.
-8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
29.9 /18.7

జిల్లాలో బుధవారం 18.7 – 29.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా
కడప కోటిరెడ్డిసర్కిల్: ఈ నెల 22వ తేదీన శుక్రవారం ఉదయం 9.00 గంటలకు కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఆ శాఖ అధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 16 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని.. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఎంపికైనవారికి హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఆరుగురు డిబార్

వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలను తనిఖీ చేస్తున్న ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి

వైవీయూ: వైవీయూ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో బుధవారం వివిధ కోర్సులకు సంబంధించి 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 56 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు హాజరయ్యారు. హైపవర్ కమిటీ సభ్యులు, స్క్వాడ్ బృందాల తనిఖీలో కాపీలు కొడుతున్న ఆరుగురిని పట్టుకుని డిబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తెలిపారు.

స్టాపింగ్‌లు యథాతథం
కడప కోటిరెడ్డిసర్కిల్: గుంటూరు–తిరుపతి–గుంటూరు, మచిలీపట్నం–ధర్మవరం–మచిలీపట్నం రైళ్ల స్టాపింగ్‌లు జిల్లాలో యథాతథంగా కొనసాగిస్తున్నామని చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. ధర్మవరం–మచిలిపట్నం ఎక్స్‌ప్రెస్‌కు కొండాపురంలో, తిరుపతి–గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు కోయిలకుంట్ల, జమ్మలమడుగులలో ప్రయోగాత్మకంగా స్టాపింగ్ కల్పిస్తూ గతంలో రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. వాటి గడువు ముగియడంతో తిరిగి పాత పద్ధతిలోనే రైళ్ల స్టాపింగ్‌లు కొనసాగిస్తున్నామన్నారు.

నేటి నుంచి స్పోర్ట్స్ మీట్
కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 21, 22 తేదీలలో రీజనల్ లెవెల్ 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలోని కడప,అన్నమయ్య జిల్లాకు చెందిన 24 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థినిలు పాల్గొంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ విషయమై బుధవారం కళాశాలలో అధ్యాపకులు, సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటుచేసి సమీక్షించారు.

నూతన కమిటీ
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ తెలిపారు. కడపలోని తమ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 18, 19వ తేదీల్లో పోరుమామిళ్లలో జరిగిన 27వ జిల్లా మహాసభల్లో కమిటీ ఎన్నుకున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడిగా రా హుల్, కార్యదర్శిగా గండి సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా వీరపోగు రవి, సహాయ కార్యదర్శులుగా అజయ్, రాజశేఖర్ రెడ్డిలతో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నామని వినోద్ తెలిపారు.

ప్రతిభ వెలికితీతకే ‘కౌశల్’

బహుమతులు అందుకున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఉన్న ఆసక్తి, ప్రతిభను వెలికి తీయడానికి జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలు, పోస్టర్ ప్రెజెంటేషన్ నిర్వహించినట్లు కౌశల్ సమన్వయ అధికారి విజయమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 36 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. క్విజ్ విభాగంలో ప్రథమ బహుమతి రూ.7,500ను దొమ్మరనంద్యాల జెడ్పీహైస్కూల్, ద్వితీయ బహుమతి రూ.6వేలను వేంపల్లె ఎంజేబీ హైస్కూల్, తృతీయ బహుమతి రూ.4,500ను దొరసానిపల్లె జెడ్పీహైస్కూల్ విద్యార్థులు గెలుచుకున్నారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌లో సాధారణ, ప్రత్యేక అంశాల నుంచి వేర్వేరుగా ప్రథమ బహుమతి రూ.3వేలు, ద్వితీయ బహుమతి రూ.2వేలు, తృతీయ బహుమతి రూ.1000 విజేతలకు అందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎంఈఓ సావిత్రమ్మ, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కృష్ణారెడ్డి వ్యవహరించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌశల్ జయింట్ కో–ఆర్డినేటర్ సత్యమూర్తి, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యవనం.. అధునాతనం

కడప గడపలో రిమ్స్ వైభవం!
- ప్రారంభోత్సవానికి సిద్ధమైన మూడు ప్రత్యేక భవన సముదాయాలు
- నాడు తండ్రి అడుగులకు దీటుగా ముందడుగు వేసిన తనయుడు వైఎస్ జగన్
- పుట్టినరోజు కానుకగా జిల్లాకు వైద్య వనం
- నేడు వాడవాడలా విస్తృత సేవా కార్యక్రమాలు


నిర్మాణంలో ఉన్న కేన్సర్ హాస్పిటల్ భవనం


కడప రిమ్స్ ఆవరణలో సూపర్ స్పెషాలిటీ విభాగం

సాక్షి ప్రతినిధి, కడప: ‘పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాన్న రెండు అడుగులు ముందుకేస్తే, ఆయన కొడుకుగా నాలుగు అడుగులు ముందుకేస్తా... మీ బిడ్డగా నాక్కావాల్సింది మీ ప్రేమాభిమానాలు... ప్రతి ఇంట్లో ఉన్నట్లు నాన్న ఫొటో పక్కన నా ఫొటో కూడా చేరాలి’.. విపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అచ్చం అలాగే పేదలకు పెన్నిధిగా మారారు. సమగ్రాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. పుట్టిన గడ్డ వైభవోపేతానికి విశేషకృషి చేస్తున్నారు. కడప గడపలో రిమ్స్ వైద్య వనం అందుబాటులోకి తెచ్చారు. పుట్టినరోజు కానుకగా జాతికి అంకితం చేయనున్నారు. దశదిశలా రిమ్స్ వైభవాన్ని చాటిచెప్పనున్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని తపించారు. 230 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లు వ్యయంతో ‘రిమ్స్’వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారు. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. ఈనేపథ్యంలో డాక్టర్ వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిమ్స్ ప్రాంగణంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్, మానసిక వైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.272.81కోట్లతో మూడు ప్రత్యేక విభాగాల వైద్యశాలలను అందుబాటులోకి తెచ్చారు. ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.125కోట్లతో 452 పడకల సూపర్ స్పెషాలిటీ విభాగం, రూ.40.81 కోట్లతో 100 పడకల మానసిక వైద్యశాల, మరో రూ.107 కోట్లతో 100 పడకల కేన్సర్ హాస్పిటల్ నిర్మించారు. కార్డియాలజీ, పీడియాట్రిక్, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ లాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇకపై కడప గడపలో రిమ్స్ వైద్య వనంలో అందనున్నాయి. దీంతోపాటు వంద పడకల కేన్సర్ హాస్పిటల్, వంద పడకల మానసిక వైద్యశాల అందుబాటులోకి రావడంతో జిల్లా వాసులకు ఎంతో ఉపశమనం దక్కనున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

సీఎం బర్త్‌డే కానుకగా....

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే కానుకగా జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను అందుబాటులోకి తెస్తున్నారు. కడప పురవీధులు, 12 సర్కిళ్లల్లో రూపురేఖలు మారుస్తున్నారు. రూ.120కోట్ల వ్యయంతో సుందర కడపగా తీర్చిదిద్దారు. బుగ్గవంక ప్రొటెక్షన్‌వాల్‌కు ఇరువైపులా రహదారులు సిద్ధం అవుతున్నాయి. ఇవన్నీ జాతికి అంకితం అయిన తర్వాత నగరవాసులకు ఎంతో ఉపశమనం దక్కనుంది. ఆదరించి అక్కున చేర్చుకున్న జిల్లా వాసుల మదిలో చిరస్థాయిగా నిల్చేందుకు ప్రణాళికలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సక్సెస్ అయ్యారని పలువురు కొనియాడుతున్నారు. కాగా గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

నాడు వైఎస్సార్.. నేడు జగన్‌తోనే సాధ్యం


నాటి కడప జిల్లా నేటి వైఎస్సార్ జిల్లా వైఎస్ కుటుంబం చల్లని చూపుతోనే అభివృద్ధి చెందింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో మరింత వేగంగా ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారు. కడప రూపురేఖలను మార్చారు. నాడు వైఎస్సార్, నేడు జగనన్నతోనే అభివృద్ధి సాధ్యమైంది. –ఎస్‌బీ అంజాద్‌బాషా, డిప్యూటీ సీఎం

సీఎం ప్రణాళిక మేరకే పనులు


జిల్లా సమగ్రాభివృద్ధి, పారిశ్రామికప్రగతికి సీఎం వైఎస్ జగన్ రచించిన ప్రణాళికలు మేరకే అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా కేంద్రమైన కడప సుందర నగరంగా మారింది. జంక్షన్లు రూపురేకలు మారిపోయాయి. ఇవన్నీ ఈనెల 23న సీఎం చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి.–విజయరామరాజు, కలెక్టర్

ఇకపై సూపర్ స్పెషాలిటీ సేవలు


ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఇకపై సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రాను న్నాయి. వరస క్రమంలో ఏడు రకాల స్పెషాలిటీ వైద్యం కడపలో దక్కనుంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాటిన రిమ్స్ మొక్క నేడు మహావృక్షమై ప్రజలకు కల్పతరువుగా మారనుంది. – డాక్టర్ సుర్వేశ్వరరెడ్డి, సూపరింటెండెంటు

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


సెంచురీ పానెల్స్ పరిశ్రమ ఉద్యోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23, 24, 25 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న దృష్ట్యా బుధవారం కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటించే ప్రాంతాలను వారు సందర్శించారు.

- రిమ్స్‌లోని పలు విభాగాలతో పాటు వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్లను పరిశీలించారు. అనంతరం ఆధునికీకరించిన కలెక్టరేట్ ప్రధాన భవనాన్ని, ఆర్టీసీ బస్టాండు వద్ద నవీకరించిన అంబేడ్కర్ సర్కిల్, కోటిరెడ్డిసర్కిల్, ఏడురోడ్లతో పాటు కడప ఎయిర్‌పోర్టును పరిశీలించారు.

సెంచురీ ప్యానెల్స్‌లో..

గోపవరం: సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీలతో పాటు బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ సెంచురీ పానెల్స్ పరిశ్రమలోని ఎంబీఎఫ్, హెచ్‌డీఎఫ్ యూనిట్లను బుధవారం పరిశీలించారు. పరిశ్రమ ఉద్యోగులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. పరిశ్రమ ప్రతినిధులకు, ఉద్యోగులకు, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం జిల్లా ఎస్పీ భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం: మండల కేంద్రమైన సింహాద్రిపురంలో దాదాపు రూ.200 కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులతోపాటు నూతన ప్రభుత్వ కార్యాలయాలు, వైఎస్సార్ పార్కులను పూర్తి చేశారు. వీటిని ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీలు బుధవారం పరిశీలించారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్: సీఎం పర్యటన నేపథ్యంలో పులివెందుల మెయిన్ బజార్‌లో జరుగుతున్న సెంట్రల్ బోలేవార్డు అభివృద్ధి పనులను బుధవారం సాయంత్రం కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. మోడల్ టౌన్ అభివృద్ధి పనులను, సీఎస్ఐ చర్చి ఆవరణ తదితరాలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీ గణేష్‌కుమార్, కడప కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్డీఓలు మధుసూదన్, వెంకటరమణ, వెంకటేశులుతో పాటు వివిధ శాఖల జిల్లా, మండలస్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యాదీవెన.. విదేశాలకు నిచ్చెన

- జిల్లాలో 10 మందికి రూ. 1.03 కోట్లు
- సివిల్ సర్వీసెస్ కింద తొమ్మిది మందికి రూ.8 లక్షలు


లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: జగనన్న విదేశీ విద్యా దీవెన రెండో విడత లబ్ధి మొత్తాన్ని బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్ నొక్కి ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, సోషల్ వెల్ఫేర్ జేడీ సరస్వతి వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాకు చెందిన విద్యార్థుల తల్లులకు మొత్తం రూ.1,03,79,140 మెగా చెక్కును అందజేశారు. విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా పూర్తి స్థాయి రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. విదేశాల్లో పీజీ స్థాయి ఉన్నత విద్యను అభ్యసించేందుకు పేద విద్యార్థులకు ఇదో సువర్ణ అవకాశమన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులు వారికి ఇష్టమైన యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొంది ఉండాలని, తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల్లోపు ఉండాలని చెప్పారు. అర్హులు పంపిన దరఖాస్తులను విజయవాడలో ఉన్నతాధికారులతో కూడిన కమిటీ పరిశీలిస్తుందన్నారు. ఎంపికైన వారికి ప్రభుత్వం ఏడాదికి రూ. 70 లక్షల వరకు నాలుగు విడతలుగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ప్రస్తుతం ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో ఈబీసీ వర్గానికి చెందిన ఆరుగురు, బీసీ, మైనారిటీల నుంచి ఒకరు చొప్పున, కాపు ఇద్దరు.. మొత్తం 10 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే 1902 కాల్ సెంటర్‌కు డయల్ చేయాలని సూచించారు. కాగా, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాల కింద మొదటి విడతలో యూపీఎస్సీ నిర్వహించిన ప్రిలిమ్స్ క్లియర్ అయి మెయిన్స్‌కు ప్రిపేరవుతున్న ఏడుగురికి రూ. లక్ష చొప్పున విడుదలైందన్నారు. ఇందులో ఈబీసీ వర్గానికి చెందిన వారు నలుగురు, కాపు ఇద్దరు, బీసీ ఒకరు ఉన్నారన్నారు. అలాగే మెయిన్స్ క్లియర్ అయి ఇంటర్వ్యూకు ప్రిపేరవుతున్న ఇద్దరికి రూ. 50 వేలు చొప్పున విడుదలైందన్నారు.

విద్యకు సమున్నత స్థానం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి సమున్నత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. పేద విద్యార్థుల కోసం పలు విప్లవాత్మక మార్పులు చేపట్టారని, అందులో భాగమే విదేశీ విద్యా దీవెన పథకమని వివరించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

విదేశీ విద్యా దీవెన ఓ వరం


ఆర్థికంగా ఇబ్బందులు పడే మాబోటి కుటుంబాలకు చెందిన పిల్లలకు విదేశాల్లో చదివే అవకాశాన్ని సీఎం వైఎస్ జగన్ కల్పించడం ఓ వరం. మా కుమారుడు సల్మాన్ యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో ఎంఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గతేడాది నా భర్త మరణించాడు. విదేశీ విద్యా దీవెన నిధులు విడుదలయ్యాయి. మా కల నెరవేరనుంది. – షెహనాజ్, కడప

పకడ్బందీగా ‘ఆడుదాం ఆంధ్ర’


మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిల్లో ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమం విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రత్యూష, జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీఎస్డీఓ జగన్నాథ రెడ్డిలు పాల్గొన్నారు.

బంగారు భవితకు సాంకేతిక విద్య

- నేడు జిల్లావ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- 15649 మందికి అందజేత



కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం రెండో ఏడాది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తోంది. వారి బంగారు భవితకు అడుగులు పడనున్నాయి. 21వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు మండలాల వారీగా విద్యాశాఖ అధికారులు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ట్యాబ్‌లు ఇప్పటికే మండల కేంద్రాలకు చేరుకున్నాయి. అక్కడి నుంచి పాఠశాలలకు కూడా చేరాయి. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌జిల్లాలో 36 మండలాల పరిధిలోని 2023–24 ఏడాదిగాను 369 పాఠశాలల్లో 15,649 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించాలని అధికారులు నిర్ణయించారు. శాంసంగ్ సంస్థ తయారు చేసిన వీటిల్లో బైజూస్‌కు చెందిన ఎడ్యుకేషన్ మెటీరియల్, కంటెంట్‌ను ఉచితంగా అందించనున్నారు. ఇంటర్‌నెట్ లేకపోయినా ఆఫ్‌లైన్‌లో కూడా వీటి ద్వారా పాఠాలు వినే అవకాశం ఉంటుంది.

డిజిటల్ విద్యా విధానానికి పెద్దపీట


మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: డిజిటల్ విద్యా విధానానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని కలెక్టర్ కార్యాలయ సభాభవన్‌లో జిల్లాలోని సమగ్రశిక్ష ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, మండల లెవెల్ అకౌంటెంట్లు, సీఆర్‌పీలకు ట్యాబ్ పంపిణీ, విద్యాశాఖ కార్యక్రమాలపైన ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా మూడు దశల్లో పది రకాల పనులు చేశారన్నారు.ఆలాగే నేడు (21వ తేదీ గురువారం) ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లును సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ట్యాబ్‌లను పాఠశాలలకు చేరవేసినట్లు చెప్పారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



విజేతలతో కమాండెంట్ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు

సిద్దవటం : క్రీడలు ఆడటం వల్ల శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు అన్నారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో బుధవారం 16వ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 2023 మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలుత బెటాలియన్‌లోని కంపెనీల పోలీసులు కవాతు నిర్వహించగా కమాండెంట్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ క్రీడోత్సవాలు మనలో ఉన్న మానసిక ఉల్లాసానికి, ఐక్యతకు ప్రతీకగా చెప్పుకోవచ్చన్నారు. పోలీసులకు 100 మీటర్లు, 800 మీటర్లు పరుగుల పోటీలు, క్రికెట్, వాలీబాల్, లాంగ్ జంప్, షాట్‌పుట్, షటిల్ క్రీడా పోటీలను నిర్వహించారు. 800 మీటర్ల పరుగు పోటీలో సి–కంపెనీకి చెందిన కె. అనిల్‌కుమార్ మొదటి స్థానంలో నిలిచారు. రెండవ స్థానంలో డి–కంపెనీకి చెందిన యు. రవి, మూడవ స్థానంలో ఎఫ్– కంపెనీకి చెందిన టి. అశోక్ గెలుపొందగా వారికి కమాండెంట్ శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెట్లు వి. కేశవరెడ్డి, కె. వెంకట్‌రెడ్డి, వి. విజయప్రసాద్, ఎస్.డి. ప్రసాద్, ఆర్‌ఐలు , ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల వాహనం బోల్తా

8 మందికి తీవ్ర గాయాలు



కూలీలతో వెళుతున్న వాహనం వంకలో బోల్తా పడిన దృశ్యం



గాయపడి రోదిస్తున్న కూలీలు

అట్లూరు : మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం సమీపంలో కడప–బద్వేలు ప్రదాన రహదారి పక్కన ఉన్న వంకలో వ్యవసాయ కూలీల వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 8 మంది మహిళలకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు మండలం శీలంవారిపల్లికి చెందిన 12 మంది మహిళా కూలీలు సిద్దవటం మండలం ఎస్.రాజంపేట పొలాలలో వరినాట్లు వేసేందుకు ఏపీ 39 టీటీ 4627 నంబరు గల వాహనంలో బుధవారం తెల్లవారుజామున బయలు దేరారు. అట్లూరు మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం కాలనీకి సమీపంలో కడప–బద్వేలు ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు గోడ ఎక్కి వంకలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సునీతా, సనమ్మ, భాగ్యమ్మ, సనక్క, ఓబులమ్మ, బుజ్జమ్మ, సుజాతలకు కాళ్లు చేతులు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. అయితే వాహనం బోల్తాపడిన వెంటనే సమీప పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బయటకు తీసి 108 కు సమాచారం అందించారు. వెంటనే అట్లూరు, సిద్దవటం 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారు రోదిస్తున్న దృశ్యాలు చూపరులను కంట తడి పెట్టించాయి.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి



సంఘటన స్థలంలో మృతి చెందిన శివప్రసాద్

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని పగిడాల బైపాస్ రహదారి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని గోపాయపల్లెకు చెందిన మండ్ల శివప్రసాద్ (25) ప్రొద్దుటూరు నుంచి ఇంటికి వెళుతుండగా పగిడాల బైపాస్ రహదారి వద్ద ద్విచక్ర వాహనాన్ని అదుపు చేయలేక కిందపడి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శివప్రసాద్ ప్రొద్దుటూరులో హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మృతునికి భార్య వరలక్ష్మితోపాటు 5 ఏళ్లు, 3 ఏళ్ల వయసు గల ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి పెద్ద దస్తగిరి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐతోపాటు, ఏఎస్ఐలు సుబ్బారెడ్డి, సిద్ధయ్య పరిశీలించారు.



రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువపత్రాలు జారీ



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవడమే ఆలస్యం. వెంటనే వలంటీర్ ద్వారా ధ్రువపత్రాలు మా ఇంటికి వద్దకే తీసుకువచ్చి ఇచ్చారు. గతంలో ధ్రువపత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువపత్రాలన్నీ కూడా ఉచితంగానే ఇవ్వడం జరుగుతుందని మా వలంటీర్ ఇంటికి వచ్చి తెలియజేయడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే ధ్రువపత్రాలు మాకు అందాయి. నవరత్నాల ద్వారా ఇల్లు కూడా మంజూరైంది. ఆ ఇంటిని కూడా నిర్మించుకున్నాము. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ కూడా చేయించుకున్నాను. మా కుటుంబానికి ప్రభుత్వ పథకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలు మేము ఎప్పటికీ మరచిపోలేము.

– బాదిరెడ్డిలక్ష్మిదేవి, కాలువపల్లె, గోపవరం మండలం

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన



ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోంది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, మంచినీటి వసతి, ఉచిత యూనిఫాం, పాఠ్య,నోటు పుస్తకాలు, బూట్లు తదితర వాటిని అందించడంతో పాటు మంచి రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. నా కుమార్తె హుసేన్‌బీ 1వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతూ ప్రస్తుతం 5వ తరగతి చదువుతోంది.

– హసీనా, విద్యార్థిని తల్లి, ప్రొద్దుటూరు.

సొంతింటి కల నెరవేరింది



రాష్ట్రంలో నిరుపేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది. గతంలో అనేక సంవత్సరాలుగా సొంతింటి కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నా. కానీ ఫలితం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం పేదల సొంతింటి కల నెరవేర్చారు.

– భారతి, పులివెందుల

క్రీడలలో లయోలా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులకు మెమెంటోలను అందిస్తున్న కళాశాల కరస్పాండెంట్, తదితరులు

పులివెందుల టౌన్ : ఈనెల 18, 19 తేదీలలో రాజంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్,గేమ్స్ మీట్‌లో పులివెందుల లయోలా పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంథోని స్వామి, ప్రిన్సిపల్ ఫాదర్ బ్రిట్టోలు తెలిపారు. బుధవారం స్థానిక లయోలా పాలిటెక్నిక్‌లో వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు గేమ్స్‌లో టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో విన్నర్స్‌గా నిలిచారన్నారు. అలాగే వాలీబాల్ పోటీలో రన్నర్స్‌గా నిలిచారన్నారు. షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, 100 మీటర్ల, 200 మీటర్ల, 800 మీటర్ల పరుగు పందెం పోటీలలో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. అలాగే రిలేలో ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. ప్రతిభ చూపిన తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌కు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ విజయరాజు, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ దొంగ అరెస్టు



హుండీ దొంగ అరెస్టు చూపుతున్న పోలీసులు

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ దేవాలయంలో హుండీ దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ బాలమద్దిలేటి తెలిపారు. బుధవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌ల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ముదిగుబ్బ వైపు నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంలో వస్తుండగా వారిని ఆపేందుకు ప్రయత్నించామన్నారు. వారు కొండ పొదల్లోకి పారిపోయారన్నారు. వారిలో ఒకరిని పట్టుకుని విచారించగా.. ధర్మవరానికి చెందిన వవన్‌గా గుర్తించామన్నారు. మూడు నెలల క్రితం అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ దేవాలయంలోని హుండీ దొంగతనంతో పాటు రెండు నెలల క్రితం సిద్ధవటం మండలం గంగమ్మ ఆలయంలో కూడా దొంగతనం చేసినట్లు అంగీకరించాడన్నారు. అతని వద్ద నుంచి రెండు ఆలయాల్లోని హుండీలలోని రూ.39,392ల డబ్బు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, కర్నాటకకు చెందిన పాండు అనే నిందితుడు పరారయ్యాడని, అతని కోసం గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వెంకన్న దర్శనం కోసం బయలుదేరి మృత్యువాత



ఒంటిమిట్టలోని రామతీర్థంలో మృతి చెందిన బల్లి అఖిల్‌తేజ

ఒంటిమిట్ట : వెంకన్న దర్శనం కోసం బయలుదేరిన బల్లి అఖిల్‌తేజ (26) అనే యువకుడు ఒంటిమిట్ట మండలంలోని కడప–చెన్నై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రామతీర్థంలో బుధవారం మృతి చెందాడు. కడప సాయిపేటకు చెందిన బల్లి అఖిల్‌తేజ గోవిందమాల వేసుకున్నాడు. మూడురోజుల క్రితం కడప నుంచి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరాడు. అయన ఒంటిమిట్టలోని కోదండ రామస్వామి ఆలయంలో రాత్రి బసచేసి ఉదయం స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు రామతీర్థంలో పడ్డాడని కుటుంబీకులు తెలిపారు. రెండు రోజులుగా ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలతో పాటు తిరుపతి ప్రాంతాల్లో వెతికామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రామతీర్థంలో శవమై కనిపించాడని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు సాయిపేటలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్థానికులతో కలిసి తిరుమల పాదయాత్రకు బయలుదేరాడు. మృతిపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరికిరణ్‌రెడ్డి

రామాపురం : కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం సుద్దమళ్ల రోడ్డు క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్టేట్‌బ్యాంకు ఉద్యోగి హరికిరణ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కడప నగరం ప్రకృతి నగర్‌కు చెందిన హరికిరణ్‌రెడ్డి లక్కిరెడ్డిపల్లె స్టేట్ బ్యాంకులో క్యాషియర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. డ్యూటీ పూర్తి చేసుకుని బైకుపై కడపకు బయలుదేరారు. సుద్దమళ్ల క్రాస్ వద్దకు రాగానే సుద్దమళ్ల నుంచి రామాపురం వస్తున్న ప్రైవేటు స్కూల్ బస్సును బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో హరికిరణ్‌రెడ్డి ఎడమ కాలు పూర్తిగా విరిగి తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంటనే రామాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

పట్టపగలు మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె : పట్టపగలే మెయిన్‌రోడ్డుపై మహిళ మెడలో గొలుసు చోరీ చేసి దర్జాగా పారిపోయిన ఘటన బుధవారం పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్‌లో జరిగింది. బండమీదకమ్మపల్లెకు చెందిన బోయపాటి లక్ష్మీదేవి(75) మధ్యాహ్న సమయంలో ఇంటి ముందు అరుగుపై కూర్చొని ఉంది. కుటుంబ సభ్యులు ఇంటిలోపల ఉన్నారు. ఇద్దరు వ్యక్తులు మోటార్‌బైక్‌పై వచ్చి ఒకరు ఆమె వద్దకు వెళ్లి ఏదో వివరాలు అడుగుతున్నట్లు ప్రయత్నిస్తూ, చుట్టుపక్కల ఎవరూ తనను గమనించడం లేదని నిర్ధారించుకుని లక్ష్మీదేవి మెడలోని గొలుసును లాక్కున్నాడు. వెంటనే మోటార్‌బైక్‌పై వేచిచూస్తున్న మరోవ్యక్తితో కలిసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ తతంగం మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయింది.